పథకాల అక్రమ బదిలీ!?

- లబ్ధిదారుడు ఒక్కరే..పంపిణీ పలువురికి
- గులాబీ మార్కు రాజకీయం
- లోపాయికారి ఒప్పందాలతో ఎన్నికల్లో గట్టెక్కే యత్నం
- దళిత, బిసి, మైనార్టీ బంధు పథకాలకు చెదలు
- దూ(దు)రాలోచనలో సర్కారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం పథకాల అమల్లో అక్రమాలకు తెరతీస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా బదిలీచేస్తూ వచ్చే ఎన్నికలను గట్టెక్కే ప్రయత్నం చేస్తున్నది. ఎక్కువ మందికి లబ్ధిచేకూర్చేందుకు తాను రూపొందించిన విధానాన్ని తానే ఉల్లంఘిస్తున్నది. జిల్లాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తుండటం గమనార్హం. దళిత, బిసి, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాలు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా అమలవుతున్నాయి. పథకాలకు ఎంపిక చేసిన అసలైన లబ్ధిదారులతోపాటు ఇతులకూ సర్దుబాటు చేస్తున్నది. రికార్డుల్లో అధికారికంగా ఒక పేరు ఉంటే, అనధికారికంగా మరో ఇద్దరు, ముగ్గురికి పథకాన్ని వర్తింపజేసి తమ రాజకీయ ప్రయోజనాన్ని నెరవేర్చుకునే ప్రయత్నంలో ఉంది. ఇందుకు ఆయా పథకాల లబ్ధిదారులు, ఇతరుల మధ్య లోపాయకారి ఒప్పందాలను కుదురుస్తున్నది. ప్రభుత్వ ఫలాలను ఎరవేయడం ద్వారా ప్రతిపక్షాలకు చెందిన చోటామోటా నాయకులు, వార్డులు, గ్రామాల్లో ప్రభావం చూపకలిగిన వ్యక్తులను వలలో వేసుకోవాలనే వ్యూహారచనకు పూనుకుంది. అనర్హులకు సర్కారీ తాయిలాలను వర్తింపజేసి ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నాలను ముమ్మురం చేసింది. ఇందుకు అధికార పార్టీ స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు పావులు కదుపుతున్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందే దూ(దు)రాలోచనే కారణం. ఉదాహరణకు సర్కారు దళితబంధు లబ్ధిదారులకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయంతో రకరకాల యూనిట్లను అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇక్కడే ఒక కిటుకు అంతర్గతంగా దాగుంది. అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారుడితోపాటు మరో ముగ్గురికి అనధికారికంగా అందులో భాగం పంచుతున్నారు. అధికార పార్టీ వారేకాకుండా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన వారినీ ఆకర్షించి పథకాన్ని అక్రమంగా వర్తింపజేస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అంటే దళితబంధులో వచ్చే రూ. 10 లక్షలను ఎంపికైన సదరు లబ్ధిదారుడుకి రూ. 4 లక్షలు, మరో ఇద్దరికి రూ. 3 లక్షల చొప్పున ఇస్తున్నారు. ఇందులో లబ్ధిదారుడికి రూ. లక్ష ఎక్కువన్న మాట. వాళ్లు ఎంపిక చేసుకున్న యూనిట్లను ఉమ్మడిగా పంచుతూ వచ్చే ఎన్నికల్లో మద్దతు పలకాలనీ, అండగా ఉండాలని ప్రమాణాలు సైతం చేయించుకుంటున్న దుస్థితి. అలాగే బిసి బంధును సైతం ఇదే పద్ధతిలో అమలుచేస్తున్నారు. ఎంపికైన లబ్ధిదారుడికి వచ్చే రూ. లక్షలో లబ్ధిదారుడికి రూ. 50 వేలు, మరో ఇద్దరికి రూ.25 వేల చొప్పున లోపాయకారిగా సర్దుబాటు చేస్తున్నారు. మైనార్టీ బంధునూ ఇలాగే నడిపిస్తున్నట్టు క్షేత్రస్థాయి ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో అదనంగా వచ్చే లబ్ధిసంగతి పక్కనబెడితే అధికార బిఆర్ఎస్ శ్రేణుల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొనడం గమనార్హం. వచ్చే సాయమే తక్కువైతే, దాన్ని సందట్లో సడేమియాలా ఇతరులకు పంచడం సరికాదని అంటున్నారు. ఇలాంటి లోపాయకారి ఒప్పందాలను అక్కడక్కడా లబ్ధిదారులు వ్యతిరేకిస్తున్నారు కూడా. యాదాద్రి-భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ గ్రామంలో ఈ తరహా ప్రయోగం చేశారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగానూ లేకపోలేదనే సందేహాలూ ఉన్నాయి. ఈ గ్రామంలో ఒక లబ్ధిదారుడు తనకు వచ్చిన దళితబంధును ఇతరులకు పంచడానికి నిరాకరించారు. దీంతో సంబంధిత లబ్ధిదారుడిని బెదిరించి మరీ లోపాయకారి ఒప్పందానికి బలవంతంగా ఒప్పించారని తెలిసింది. ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమ అనుకూలురుకు ప్రభుత్వ పథకాలను అందించే పేర అనర్హులకు ఫలహారంలా పంచిపెడుతున్నారు. ఇతర పార్టీల కార్యకర్తలు, నాయకులను తమవైపుకు తిప్పుకునే ప్రయత్నంలో ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. నిరుపేదల ఇండ్ల నిర్మాణానికి ఇస్తున్న రూ. 3 లక్షల పథకం గృహలక్ష్మిని సైతం ఇదే తంతు సాగుతోందనే విమర్శలూ లేకపోలేదు.

10న బిసి బహిరంగసభ

కర్ణాటక సిఎం సిద్ధరామయ్య రాక: విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి బహిరంగ సభను అక్టోబర్ 10న షాద్‌నగర్‌లో నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బిసి సబ్ ప్లాన్, కులగణన, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలు తదితర రాజకీయ ప్రాధాన్యం తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. బిసిలకు ఎక్కువగా సీట్లు ఇవ్వాలనీ, బిసిలు అండగా ఉంటేనే విజయం సాధిస్తామని ఆయన సూచించారు. బిసిలకు సంఖ్యాపరంగా నిధుల కేటాయింపు జరగాల్సి ఉందన్నారు. రాహుల్ గాంధీని హైదరాబాద్‌లో పోటీ చేయాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ డ్రామాలాడుతున్నారని విహెచ్ విమర్శించారు. అసదుద్దీన్ కేరళలో పోటీ చేయాలని సవాల్ చేశారు.

మహిళలను మోసం చేసిన బిజెపి :-నీతా డిసౌజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మరోసారి మహిళలను బిజెపి మోసం చేసిందని అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు నీతా డిసౌజా విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రధాని పెట్టిన బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. గతంలోనే కాంగ్రెస్ రాజ్యసభలో బిల్లు పెట్టిందనీ, లోక్‌సభలో మెజార్టీ లేకపోవడంతో బిజెపిని పదే పదే కోరినా ప్రవేశపెట్టలేదని తెలిపారు. పదేండ్ల తర్వాత బిల్లు పెట్టి జనాభా లెక్కలు, డీలిమిటేషన్ తర్వాత అని ఎందుకంటున్నారని ఆమె ప్రశ్నించారు. మహిళా బిల్లు కేవలం ఒక ప్రకటన మాత్రమేనని తెలిపారు. మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. 2034కు ముందు అమలు చేయడం సాధ్యం కాకుండా చేసి కొత్త పార్లమెంటులో మహిళలను మోసం చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలసుబ్రమణ్యంకు ఘన నివాళి

ప్రజాశక్తి - కల్చరల్

విఖ్యాత గాయకుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి సందర్భంగా శ్రీ రామ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నిర్విరామంగా పన్నెండు గంటలు సినీ గీత నివాళి అర్పించారు. ప్రముఖ గాయకులు వినోద్ బాబు, సురేఖ, వేణు శ్రీరంగం, శ్రీదేవి శ్రీకాంత్,కార్తికేయ, శశాంక సుజాత, లక్ష్మీ గాయత్రి, తదితరులు పాడిన యుగళ గీతాలు సోలో గీతాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ సంగీత గురువు రామా చారి శిష్య బృందం మధురమైన రాగాలతో పలు పాటలు హృద్యంగా ఆలపించారు. నిర్వాకుడు గొర్తి చంద్రశేఖర్ పర్యవేక్షణలో తులసీ రామ్ వ్యాఖ్యానం చేయగా రవికుమార్ కార్యక్రమాన్ని సమన్వాయం చేశారు.

రూ.500 కోట్ల కంపెనీగా కావడమే లక్ష్యం

- ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీచైతన్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లాభాలతోపాటు బలమైన రాబడి వృద్ధిని ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీచైతన్య నివేదించింది. 2025 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.500 కోట్ల కంపెనీగా కావడమే లక్ష్యమని ప్రకటించింది. ఈ మేరకు ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీచైతన్య వ్యవస్థాపక సీఈవో ఉజ్వల్ సింగ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2021-22లో అద్భుతమైన వృద్ధిని ప్రదర్శిస్తూ 2022-23కి ఆడిట్ చేసిన ఆర్థిక వివరాలను ప్రకటించామని తెలిపారు. కార్యకలాపాల ద్వారా కంపెనీ ఆదాయం 2021-22లో కేవలం రూ.2.3 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. 2022-23లో రూ.వంద కోట్లకు చేరుకుందని వివరించారు. ఈ కాలంలో వ్యయాల్లో కేవలం రెండు రెట్లు పెరిగిందని తెలిపారు. దేశంలో ఏకైక లెర్నర్ అవుట్‌కమ్ ఆధారిత లాభదాయకమైన ఎడ్‌టెక్ స్టార్టప్‌గా ఇన్ఫినిటీ లెర్న్ కొత్త ప్రమాణాలను నెలకొల్పడం, విద్యారంగంలో నూతన ఆవిష్కరణను ప్రేరేపిస్తున్నదని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న ఎడ్‌టెక్ రంగంలో ముందుకెళ్లాలని తెలిపారు.

నోటరీ స్థలాల క్రమబద్ధీకరణపై హైకోర్టు స్టే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నోటరీ స్థలాల క్రమబద్ధీకరణపై హైకోర్టు స్టే విధించింది. పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయేతర నోటరీ భూముల క్రమబద్ధీకరణ కోసం జారీ చేసిన జీవో 84 అమలు నిలిపివేస్తూ ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 3వేల గజాల్లోపు నోటరీ స్థలాల క్రమబద్ధీకరణ కోసం జులై 26న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ ప్రాంతాల్లో 125 గజాల్లోపు నోటరీ స్థలాలలకు ఉచితంగా... అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూములకు స్టాంపు డ్యూటీతో క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీవోను సవాల్ చేస్తూ భాగ్యనగర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వేసిన పిల్ పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్ ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. ప్రభుత్వ ఉత్తర్వులు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 9కి విరుద్ధంగా ఉన్నాయని ధర్మాసనం ప్రాథమికంగా అభిప్రాయపడింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ జీవో 84 అమలు చేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

బ్యాంక్ బోర్డుల్లో ఒకరిద్దరిదే ఆధిపత్యం

- ఆ పద్ధతి మానుకోవాలి
- చర్చలు స్వేచ్ఛగా జరగాలి
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్

న్యూఢిల్లీ : బ్యాంక్ బోర్డుల్లో ఒక్కరిద్దరే ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న విషయాలు తమ దృష్టికి వచ్చాయని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. సోమవారం అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్‌ల డైరెక్టర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శక్తికాంత దాస్ మాట్లాడుతూ.. "పెద్ద వాణిజ్య బ్యాంకులలో కూడా ఒకరు లేదా ఇద్దరు బోర్డు సభ్యుల అధిక ఆధిపత్యం మా దృష్టికి వచ్చింది. అలాంటి చర్యలు మానుకోవాలి. బోర్డు చర్చలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి. బోర్డులో ఒకరు లేదా ఇద్దరు సభ్యులు, లేదా ఛైర్మన్ లేదా వైస్ ఛైర్మన్ ఆధిపత్యం లేదా అధిక ఆధిపత్యం ఉండకూడదు. మేము పెద్ద వాణిజ్య బ్యాంకులలో కూడా దీనిని గమనించాము. ఇది మంచి మార్గం, విధానం కాదు." అని అన్నారు. డైరెక్టర్లందరికీ మాట్లాడే అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందని.. ఒక అంశంలో ఫలానా డైరెక్టర్ మాటే తుది నిర్ణయం కాకూడదని శక్తికాంత దాస్ బ్యాంకర్లకు సూచించారు.

గతంలో యెస్ బ్యాంక్ సంక్షోభంలోకి జారిన విషయం తెలిసిందే. ఎస్‌బిఐ నేతృత్వంలో ప్రభుత్వం బెయిల్ ఇప్పించింది. దీనికి ఆర్‌బిఐ మద్దతు ఇచ్చింది. యెస్ బ్యాంక్ కో-ఫౌండర్ రాణా కపూర్ ఆ బ్యాంక్‌కు అప్పట్లో ఎండి, సిఇఒగా ఉన్నారు. బ్యాంక్ నిధులను దారి మళ్లించి.. దివాలా తీసేలా చేశారు. ఆ తర్వాత ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ చీఫ్ చందా కొచ్చర్ క్విడ్‌ప్రోకో కేసు తెలిసిందే. వీడియోకాన్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇవ్వడం ద్వారా ఆమె భర్త దీపక్ కొచ్చర్‌కు మేలు జరిగేలా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే శక్తికాంత దాస్ బ్యాంకర్లను హెచ్చరించినట్లు తెలుస్తోంది.

అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్‌లకు డైరెక్టర్లుగా ఎన్నుకోబడిన వారు రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నలాజీ, ఇతర బ్యాంకింగ్ అంశాల్లో నైపుణ్యం కలిగి ఉండాలని దాస్ సూచించారు. సమావేశాల్లో ముందుగానే సిద్ధం చేసుకున్న ఎజెండా నోట్స్‌ను పరిశీలించి సంబంధిత ప్రశ్నలు అడగాలని తెలిపారు. డైరెక్టర్లు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడం, స్పష్టం చేయడం చాలా ముఖ్యమన్నారు.

ముగియనున్న ఎల్ఐసి 'ధన వృద్ధి' గడువు

హైదరాబాద్ : దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) సింగిల్ ప్రీమియం పాలసీ ధన వృద్ధి గడువు సెప్టెంబర్ 30తో ముగియనుంది. ఆసక్తి కలిగిన పాలసీదారులు గడువు లోపే దీన్ని కొనుగోలు చేసుకోవచ్చని ఆ సంస్థ తెలిపింది. గత జూన్‌లో ప్రారంభించిన ఈ పాలసీ పరిమిత ఆఫర్ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుందని వెల్లడించింది. పొదుపుతో పాటు బీమా కవరేజీ కావాలనుకునే వారు ఎల్ఐసి ఏజెంట్లు, ఎల్ఐసి శాఖలను సంప్రదించాలని సూచించింది. ధన వృద్ధి పాలసీ ఆన్‌లైన్‌లోనూ లభ్యం అవుతుందని తెలిపింది. ఈ పాలసీలో బీమా కవరేజీతో పాటు మీరు పెట్టే పెట్టుబడి సొమ్ముపై రిటర్న్ హామీ లభిస్తుంది. ఈ పాలసీ టెన్యూర్‌లో పాలసీదారుడు మరణిస్తే కుటుంబ సభ్యులకు ఆర్థికంగా సాయం అందిస్తుంది మెచ్యూరిటీ సమయం ముగిసిన తర్వాత గ్యారంటీ రిటర్న్ మొత్తం అందజేస్తుంది. 32 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వారు ఈ పాలసీ తీసుకోవడానికి వీలుంది.

బిజెపికి వివేక్ ఝలక్

నేడో..రేపో కారుపార్టీలో చేరిక?

పెద్దపల్లి ఎంపి సీటు కన్ఫర్మ్ !

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపి వివేక్ వెంకటస్వామి బిజెపికి గట్టి ఝలక్ ఇవ్వనున్నారు. ఆయన నేడో, రేపో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. ఇప్పటికే బిఆర్ఎస్ నాయకత్వం ఆయనతో సంప్రదింపులు పూర్తి చేసినట్టు, పెద్దపల్లి ఎంపి సీటు ఇచ్చేందుకు సిఎం కెసిఆర్ కూడా సుముఖం వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. ఆయన ఈ డీల్‌కు ఓకే చెప్పేసి కారెక్కేందుకు మొగ్గుచూపుతున్నారు. చేరికకు సంబంధించి ప్రగతిభవన్ నుంచి కూడా ఆహ్వానం అందినట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే బిఆర్ఎస్ విప్ బాల్కసుమన్ ఆయనతో భేటీ అయిన ఫొటోలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నంత కాలం బిజెపిలో వివేక్ దూకుడుగా వ్యవహరించారు. ప్రస్తుతం బండి సంజయ్, ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డిలకే ఆ పార్టీ ప్రాధాన్యత ఇస్తూ మిగతా సీనియర్లకు సరైన గౌరవం ఇవ్వట్లేదనే చర్చ కొద్దికాలంగా జరుగుతున్న విషయం విదితమే. ఆయా పార్టీల నుంచి బిజెపిలో చేరిన నేతలంతా ఒక దగ్గర భేటీ అయ్యి ఇదే అంశంపై పలుమార్లు చర్చించిన సంగతీ తెలిసిందే. అయితే, ఆ నేతల్లో చాలా మంది కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతుండగా.. వివేక్ మాత్రం బిజెపి గోడ మీద నిలబడి ఇటు కాంగ్రెస్, అటు బిఆర్ఎస్ నేతలతోనూ సంప్రదింపులు జరుపుతూ వచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ టూ బిజెపి వయా బిఆర్ఎస్ అన్నట్టుగా పార్టీలు మారుతూ పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆయన చేరిక పట్ల అంత సుముఖత చూపలేదు. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో బిజెపిలో ఉంటే ఎట్లాగూ గెలవలేం..బిఆర్ఎస్‌లోకి వెళ్తే ఎంపిగానైనా గెలిచి రాజకీయంగా కొంత మేర పెద్దపల్లి జిల్లాలో మళ్లీ పట్టు సాధించాలనే ఆలోచనకు వివేక్ వచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన కారెక్కేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ఉత్తర తెలంగాణపై గంపెడాశలు పెట్టుకున్న బిజెపికి ఇది మింగుడు పడని విషయమే.

ఎన్నికల ఎత్తుగడతో మహిళా బిల్లు

కేంద్రంలో బిసి మంత్రిత్వ శాఖ ఎందుకు లేదు?

మహిళా బిల్లులో బిసిల సబ్‌కోటాపై రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల ఎత్తుగడలో భాగంగానే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆగమేఘాలమీద తీసుకొచ్చిందని వక్తలు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో 'మహిళా బిల్లులో..బీసీ సబ్ కోటా' కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీలు-బీసీ కుల సంఘాలతో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్‌చారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ పార్లమెంట్ సభ్యులు వి హనుమంతరావు, పీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీనివాస్, నాగేందర్ గౌడ్, డిఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విశారదన్ మహారాజ్, తెలంగాణ జన సమితి అధికార ప్రతినిధి పల్లె వినయ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, తెలంగాణ ఆత్మగౌరవ వేదిక అధ్యక్షురాలు ఇందిరా శోభన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగోని బాలరాజ్ గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మని మంజరి, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నగేష్, ఓ యు జేఏసీ నాయకురాలు బాలలక్ష్మి, మహిళా రాష్ట్ర నాయకురాలు తిరుపతమ్మ, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, శ్యామల, మాధవి, వరికుప్పల మధు, కవుల జగన్నాథం శ్రీనివాస్ కుర్మా తో పాటు 80 కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, 25 బీసీ సంఘాల అధ్యక్షులు, ఉద్యోగ ఉపాధ్యాయ మహిళా విద్యార్థి యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలను కూరలో కర్వేపాకులా వాడే పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీసీలకు సూచించారు. ఎన్నికల వేళ భారత నారీశక్తుల సత్తాను ఓట్ల రూపంలో తెలిపే సందర్భం వచ్చిందని చెప్పారు. మహిళా బిల్లుతో మరో సారి అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల అస్త్రంగా మనువాద పాలకుల కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఆధిపత్య కులాల స్త్రీలను అధికార పీఠాల మీద కూర్చొబెట్టేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని తెలిపారు. బీసీ మహిళల గణన జరపకుండా... 33 శాతం మహిళా బిల్లులో మా వాటా ఎంతో తేల్చకుండా ఎట్లా అమలు చేస్తారని ప్రశ్నించారు. తక్షణం బీసీల జనాభా లెక్కలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 28 రాష్ట్రాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని తీర్మానించారు. పార్లమెంట్లో ప్రాతిథ్యం ఉన్న అన్ని పార్టీల అధ్యక్షులను, ముఖ్యమంత్రులను కలిసి బీసీ బిల్లుకు మద్దతు కూడగడతామన్నారు. కోటి మంది మహిళల స్వదస్తూరితో ప్రధాని నరేంద్ర మోడీకి లేఖలు రాయాలనీ, ఐ సపోర్ట్ బిసి ఉమెన్ బిల్ పేరుతో సోషల్ మీడియా ద్వారా ఉద్యమాన్ని చేపట్టాలని తీర్మానాలు చేశారు.

బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో కెసిఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, సమస్యలు పరిష్కరించని ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం బస్టాండ్ సెంటర్‌లోని చిల్డ్రన్ పార్క్ వద్ద అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులుగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు.. కనీస వేతనం, పర్మినెంట్, ఉద్యోగ భద్రత తదితర సమస్యలపై పోరాడుతున్నారని, వారివి అత్యంత న్యాయమైన డిమాండ్లని తెలిపారు. ఈ సమస్యలపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిష్కరించేలా ప్రభుత్వానికి పార్టీ తరపున లేఖ రాస్తానన్నారు. కార్మిక చట్టాల ప్రకారం చూసినా, అంతర్జాతీయ లేబర్ కాన్ఫరెన్స్ చెప్పిన దాని ప్రకారం ఈ రోజు ఉన్న ధరల్లో కనీస వేతనం కేవలం రూ.26 వేలు మాత్రమే అడుగుతున్నారని తెలిపారు. అనేక వేల కోట్ల రూపాయలు వృధా ఖర్చులు చేసే ప్రభుత్వానికి అంగన్‌వాడీ, ఆశా కార్మికుల వేతనాలు పెంచడం పెద్ద సమస్యే కాదన్నారు. ఉద్యోగులుగా గుర్తించకుండా పని చేసినంత కాలం గౌరవ వేతనంతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం.209/2021

మోదాల మల్లిఖార్జునరావు ......వాది

వర్సెస్

గిన్నె మధు (పోతి) వారసులు

శ్రీమతి గిన్నె రాజ్యలక్ష్మి వగైరాలు ....ప్రతివాదులు

టు,

డి4: శ్రీమతి గిన్నె కళావతి భర్త గిన్నె రామచంద్రయ్య హిందు, వయస్సు: సుమారు 62సం॥లు, గృహిణి, డోర్.నెం.7-43, శేషాద్రినగర్, స్ట్రీట్ నెం.1, షహసబ్‌గుట్ట మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు దావాలోని వాది మీ వగైరాల నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దావాను దాఖలు చేసి యున్నారు. సదరు దావాలో నీకేమైన ఆక్షేపణలు వున్న యెడల నీవు శ్రీమహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేది : 09-10-2023 న ఉదయం 10:30 ని.లకు స్వయంగా గాని లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలెయును. లేనిచో నీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

స్థలం : గిద్దలూరు శ్రీ ఎస్.వి.నాగేంద్రబాబు
తేది:23-09-2023 వాది పరం అడ్వకేట్, గిద్దలూరు.
సెల్ నెం : 9866802375

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం.373/2021

ఇన్

ఓ.ఎస్.నెం.209/2021

మోదాల మల్లిఖార్జునరావు ....పిటిషనర్/వాది

వర్సెస్

గిన్నె మధు (పోతి) వారసులు

శ్రీమతి గిన్నె రాజ్యలక్ష్మి వగైరాలు .....రెస్పాండెంట్లు/ప్రతివాదులు

టు,

ఆర్4/డి4: శ్రీమతి గిన్నె కళావతి భర్త గిన్నె రామచంద్రయ్య, హిందు, వయస్సు: సుమారు 62సం॥లు, గృహిణి, డోర్.నెం.7-43, శేషాద్రినగర్, స్ట్రీట్ నెం.1, షహసబ్‌గుట్ట, మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు పిటిషన్‌లో పిటిషనరు/వాది పిటిషన్ షెడ్యూల్ స్థిరాస్థులను హాల్‌జప్తు చేయించగోరి పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో నీకేమైన ఆక్షేపణలు వున్న యెడల నీవు శ్రీమహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేది:09.10.2023న ఉదయం 10:30 ని.లకు స్వయంగా గాని లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలెయును. లేనిచో నీ పరోక్షమందు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

స్థలం : గిద్దలూరు శ్రీ ఎస్.వి.నాగేంద్రబాబు
తేది:23-09-2023 పిటిషనర్/వాది పరం అడ్వకేట్, గిద్దలూరు.
సెల్ నెం.9866802375

హైదరాబాద్ అభివృద్ధితో రాష్ట్రాభివృద్ధి

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కెటిఆర్
- మూసీ నదిపై వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.545 కోట్లతో పలు చోట్ల 15 వంతెనలు

అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరంమీడియాతో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అత్యధిక ఆదాయ వనరులున్న హైదరాబాద్ మహా నగరాన్ని అభివృద్ధి పరుచుకుంటే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని మూసీ నదిపై వివిధ ప్రాంతాల్లో వంతెనల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో రూ.52 కోట్ల అంచనాతో నిర్మించనున్న ముసారాంబాగ్ బ్రిడ్జిని మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, బలాల శంకుస్థాపన చేశారు. నాగోల్‌లో ఫతుల్లాగూడ-పీర్జాదిగూడ మధ్య మూసీ నదిపై నాలుగు లేన్ల హైలెవల్ వంతెన నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. హెచ్‌ఎండీఏ లేఅవుట్ ఉప్పల్ భగాయత్ వద్ద మూసీ నదిపై వంతెన నిర్మాణానికి నగర మేయర్ విజయలక్ష్మి, హెచ్‌ఎండీఏ అధికారులు, బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రూ.545 కోట్లతో మూసీ నదిపై నగరంలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 15 వంతెనలను నిర్మిస్తుందన్నారు. వీటిలో ఫతుల్లగూడ నుంచి పీర్జాదిగూడ వరకు రూ.52 కోట్లతో నూతన వంతెన నిర్మాణం కోసం శంకుస్థాపన చేసుకున్నామన్నారు. ఈ వంతెనలు డిజైన్ అంశాలలో ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయని తెలిపారు. నగరంలోని దుర్గం చెరువు తర్వాత సినిమా షూటింగ్‌లకు ఈ వంతెనలు అత్యంత ఇష్టమైన ఎంపికగా నిలుస్తాయన్నారు. హైదరాబాద్‌లో ఒక అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించాలని.. శాశ్వతంగా, దీర్ఘకాలికంగా ఉండేలా బ్రిడ్జీల నిర్మాణం చేపడుతామన్నారు. దుర్గం చెరువు వద్ద 7 ఎంఎల్‌డీ కెపాసిటీ ఎస్టీపీని నిర్మించామని తెలిపారు. ఎస్టీపీలు పూర్తయితే మూసీలోకి పూర్తి స్థాయి శుద్ధి చేసిన నీటిని వదిలే పరిస్థితి ఉంటుందన్నారు.

మంచిరేవుల నుంచి ఘట్‌కేసర్ వరకు మూసీ నదిని అద్భుతంగా సుందరీకరించాలన్న సీఎం కలను నెరవేరుస్తామని తెలిపారు. 160 కిలోమీటర్ల ఓఆర్ఆర్ చుట్టూ తిరగకుండా మధ్యలో మూసీ నది మీదుగా వెళ్లే విధంగా బ్రిడ్జీలు నిర్మిస్తామన్నారు. రూ.5 వేల కోట్లతో రెండో విడుత ఎస్ఎన్‌డీపీ తొందరలోనే చేపడుతామని చెప్పారు. జీవో 118లోని చిన్న చిన్న టెక్నికల్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తొమ్మిదేండ్లలో ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను పూర్తి చేసిందని చెప్పారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్న నాయకులకు, ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, డిప్యూటీ మేయర్ మోత శ్రీలత రెడ్డి, ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం, దయానంద్ గుప్తా, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

27లోపు కాంగ్రెస్ పార్టీలోకి..

ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్‌ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం హరించబడుతోందని ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఈ నెల 27లోపు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. తనకు, తన కుమారుడికి కూడా అవకాశం ఇస్తారని భావిస్తున్నానన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దూలపల్లిలోని మైనంపల్లి నివాసంలో అల్పాహార విందులో ఆయనతో కాంగ్రెస్ నేతలు మాజి డిప్యూటీ సిఎం దామోదర రాజనరసింహ, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. తనకు పదవులు ముఖ్యం కాదని, కార్యకర్తల కోసం ప్రాణం ఇచ్చేందుకు సైతం వెనుకాడనన్నారు. అయితే తమ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా 27లోపు కాంగ్రెస్‌లో చేరతానని, మేడ్చల్- మల్కాజిగిరి, మెదక్ సీట్లు ఆశిస్తున్నట్టు తెలిపారు. నమ్ముకున్న నియోజకవర్గ ప్రజల కోసం కష్టపడతానని చెప్పారు. మేడ్చల్ ఎమ్మెల్యే సీటు నక్క ప్రభాకర్ గౌడ్‌కు ఇవ్వాలని, ఆయన తన తమ్ముడితో సమానం అన్నారు.

అనంతరం అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక సముద్రం అని, మళ్లీ పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. సీనియర్ నాయకులు హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నా మన్నారు. దామోదర రాజనరసింహ మాట్లాడుతూ.. అందరం కలిసికట్టుగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంఏర్పాటుచేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఢిల్లీ పెద్దలను కలిసి కాంగ్రెస్ అధినేత్రి సమక్షంలో చేరికలు ఉంటాయనితెలిపారు.ఎవరికిసీట్లుఎక్కడ ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుం దని, వారు చెప్పిన మార్గంలోనే ముందుకు సాగుతామని అన్నారు.

పాలమూరుకు జాతీయ హోదా సంగతేంటి..?

చేవెళ్ళ ఎంపి డాక్టర్ జి. రంజిత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించే విషయంలో ప్రధాని మోడీ నోరు విప్పాలని చేవెళ్ళ ఎంపీ డాక్టర్ జి. రంజిత్ రెడ్డి డిమాండ్ చేశారు. హోదా ఇచ్చిన తర్వాతే తెలంగాణలో అడుగు పెట్టాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ ఒకటిన ప్రధాని మహబూబ్‌నగర్ జిల్లాలకు రానున్న నేపథ్యంలో బిజెపి ప్రజలకు సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. పాలమూరుకు చేసిందేమి లేకుండా మోడీ వచ్చి చెప్పేదేముందని ఆయన ప్రశ్నించారు. ఎన్నిసార్లు కోరిన పాలమూరును పట్టించుకోకుండా ఎన్నికల సమయంలో కర్ణాటకలోని అప్పర్ భద్రకు జాతీయ హోదా ఇచ్చారని విమర్శించారు. అప్పర్ భద్రకు ఇస్తే తప్పు లేదనీ, పాలమూరుకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. జాతీయ హోదా ఇవ్వకుంటే పాలమూరు,రంగారెడ్డి ప్రజలు ఎప్పటికీ క్షమించారని హెచ్చరించారు.

ఇంటి జాగా దక్కేవరకు పోరాటం

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్
- జిల్లా కేంద్రంలో గుడిసెవాసుల భారీ ర్యాలీ

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవీంద్రకుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా వాజేడు మండలంలో ప్రభుత్వ భూమిలో రెండు వేల మంది నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే, వాటిని తొలగించడంతో.. 15 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారని, ఇళ్లు తొలగిస్తే ప్రతిఘటిస్తామే కాని చూస్తూ కూర్చోమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు గుడిసెవాసుల భారీ ర్యాలీ చేసి నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదల కుటుంబాలు ఇరుకు ఇళ్లలో జీవనం సాగిస్తున్నారన్నారు. తెలంగాణ వస్తే పేదలకు పక్కా ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చిన సిఎం కెసిఆర్ విస్మరించారని తెలిపారు. గోదావరి వరదలకు ముంపునకు గురయ్యే గ్రామంలో ప్రజలకు పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలని అనేక మార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. విసిగిపోయిన ప్రజలు వాజేడు రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 11లోని 70 ఎకరాల్లో గుడిసెలు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఆ గుడిసెలకు హక్కు కల్పించకుండా తొలగించాలని చూడటం సరి కాదన్నారు. జాగా వదిలిపోయేది లేదని, ఉంటే గుడిసెలో.. లేకపోతే జైల్లో తప్ప జాగా వదులుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. 2000 మంది పేదలు 15 రోజుల నుంచి ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం స్పందించక పోవటం దుర్మార్గమన్నారు. వాజేడులో మొదలైన పోరాటం ములుగు వరకు వచ్చిందని, గుడిసెలు దక్కకపోతే హైదరాబాద్ వరకూ పోతామని స్పష్టంచేశారు.

అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వాజేడు మండలంలో 40 గ్రామాల నుంచి 1950 మంది పేదలు గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని వారికీ హక్కు కల్పించకుండా వెళ్లగొట్టాలని చూస్తున్నారని తెలిపారు. 20 గ్రామాల్లో ప్రజలు ముంపునకు గురవుతున్నా వారిని పాటించుకొనే నాథుడే లేడని, వరదలు వచ్చినప్పుడు పునరావాస కేంద్రాలకు తీసుకెళ్లి వరదలు పోయాక నడిరోడ్డు మీద వదిలి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వారికి ఇళ్ల జాగాలు ఇచ్చి, ఇల్లు కట్టించి ఇవ్వాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ఆర్డీవో సత్యపాల్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా నాయకులు బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, ఎండీ దావుద్, గ్యానం వాసు, వాజేడు మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, నాయకులు గుగ్గిళ్ళ దేవయ్య, బచ్చల కృష్ణబాబు, జెజ్జరీ దామోదర్, బచ్చల సౌమ్య, తోలేం ముత్తయ్య, కారం బులక్ష్మి, పాయం కుమారి తదితరలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేస్తున్న వామపక్ష నాయకులు

గ్రంథాలయ భవన నిర్మాణాన్ని వేరే చోటకు మార్చండి

- వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్
- ప్రజావాణిలో వినతిపత్రం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ భవన నిర్మాణాన్ని వేరే చోటికి మార్చాలని, బాలికల ప్రభుత్వ కళాశాల జోలికి వస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని వామపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు నూతన భవనం కట్టించాలని, గ్రంథాలయ నిర్మాణాన్ని వేరే చోటికి మార్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ.. పెద్దపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని కూల్చి, దాని స్థానంలో గ్రంథాలయాన్ని నిర్మించాలన్న తప్పుడు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. వెంటనే గ్రంథాలయ భవన నిర్మాణాన్ని వేరే చోటికి మార్చి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు అన్ని సౌకర్యాలతో నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. కళాశాల జోలికిస్తే వామపక్ష పార్టీలు, విద్యాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సుదనందం, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు, సిపిఐ(ఎంఎల్) డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జూపక శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్ పాల్గొన్నారు.

నేటి తరానికి కొరటాల జీవితం ఆదర్శనీయం

- బి వెంకట్, టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొరటాల సత్యనారాయణ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో రైతు నాయకులు కొరటాల సత్యనారాయణ శత జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వారు నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ..సత్యనారాయణ నిరంతరం కార్మిక, రైతాంగ, ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. అణగారిన వర్గాల ప్రయోజనం కోసం నిరంతరం కృషి చేసిన ఆయన చట్టసభల్లో సైతం వారి కోసం గొంతు విప్పి ప్రశ్నించేవారన్నారు. రైతాంగ పోరాటంలో జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఉవ్వెత్తున సాగిన ప్రజా ఉద్యమంలో పాల్గొన్న ఆయన ఉద్యమానికి మద్దతుగా శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారన్నారు. మరో వైపు శ్రామికుల సమస్యల పరిష్కారానికి సంఘాలు నిర్మించి అనేక ప్రయోజనాలు సాధించడానికి కృషి చేశారని కొనియాడారు.

పేద, కౌలు రైతుల ప్రయోజనాల కోసం, వృత్తిదారుల సంరక్షణకు చట్టబద్ధతను సాధించేందుకు ఎంతగానో కృషి చేశారని చెప్పారు. తుది శ్వాస విడిచే వరకు మార్క్సిస్టు సిద్ధాంతంపై అత్యంత విశ్వాసంతో కమ్యూనిస్టుగా పనిచేశారన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బొప్పని పద్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగం గొప్ప బాధ్యత

- హోంమంత్రి మహమూద్ అలీ
- 'తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్' ప్రారంభం

కార్యక్రమంలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్ర పోలీసులు బాగా పనిచేస్తున్నారని, ఈ ఉద్యోగం అంటేనే గొప్ప బాధ్యతతో కూడుకున్నందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిసి కెమెరాలను అనుసంధానం చేసిన 'తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్' (టిజిసిసిసి) విభాగాన్ని సోమవారం హోంమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సిఎం కెసిఆర్ ముందు చూపుతో పోలీస్ శాఖకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఎంతో అభివృద్ధిని సాధించామని, కొత్తగా తొమ్మిది పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసుకున్నామని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తున్నామని చెప్పారు. పోలీస్ శాఖలో సమర్ధవంతమైన పోలీస్ అధికారులున్నారని, దాంతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ బాగుందన్నారు. పోలీస్ శాఖలో 33 శాతం మహిళా ఉద్యోగుల నియామకం జరుగుతోందన్నారు. మంత్రి కెటిఆర్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి, ఐటీ రంగం ఎంతో పురోగతి సాధించిందన్నారు. డిజిపి అంజనీ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధిని సాధించామ న్నారు. మావోయిస్టులు, రౌడీల సమస్యలు లేకుండా చేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ముందుకెళ్తున్నామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించే ముందు ఇతర రాష్ట్రాల్లో పూర్తిగా అధ్యయనం చేశామని తెలిపారు. తెలంగాణ పోలీసింగ్ విధానం న్యూయార్క్ పోలీసింగ్ తరహాలో ఉందన్నారు. నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ మాట్లాడుతూ గతంలో గణేష్ నిమజ్జనాన్ని బషీర్‌బాగ్ కమిషనరేట్లలోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి వీక్షించేవాళ్లమని, ఈ సారీ ఇక్కడి నుంచే పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాన్ని పూర్తి చేస్తామన్నారు. నూతనంగా ప్రారంభించిన ఈ విభాగంలో సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా 2306 కెమెరాలను ప్రారంభించినట్టు తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూం అంటే పోలీసులదే కాదని, అన్ని శాఖలదన్నారు. జిహెచ్ఎంసి, వాటర్‌బోర్డుతోపాటు ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో అన్ని ప్రాంతాల్లోనూ నిఘా ఉంచామన్నారు. ఇందులో మూడు రకాల సిసి టీవీ ప్రాజెక్టులను అనుసంధానం చేశామని చెప్పారు. సిటీ వైడ్ ప్రాజెక్టు కింద పది వేలు, కమ్యూనిటీ కింద పది వేలు, సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా 2500 కెమెరాలున్నాయన్నారు. ఏదైనా సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు సిసి కెమెరాల పాత్ర కీలకంగా ఉంటుందని, ఇక్కడి నుంచే వారిని అప్రమత్తం చేస్తామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మల్టీ ఏజెన్సీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సిపి వీక్రమ్ సింగ్ మాన్, సుధీర్‌బాబు, విశ్వప్రసాద్, జాయింట్ సిపి గాజారావు భూపాల్‌తోపాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అసమర్థత వల్లే గ్రూప్-1 పరీక్ష రద్దు

- టిఎస్‌పిఎస్‌సి చైర్మన్‌ను తొలగించాలని డివైఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగి నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమైఖ్య (డివైఎఫ్ఐ) హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అశోక జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి దోగ్గెల తిరుపతి మాట్లాడుతూ.. ప్రభుత్వం, టిఎస్‌పిఎస్‌సి బోర్డు నిర్లక్ష్యం వల్లే నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, పరీక్ష నిర్వహించే శక్తి లేని టిఎస్‌పిఎస్‌సి చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన అభ్యర్థులకు రూ.1 లక్ష చొప్పున పరిహారం అందించాలని కోరారు. ఒకసారి పేపర్ లీకేజీతో మరోసారి పరీక్ష రాయాల్సిన పరిస్థితి దాపురించిందని, అయినా ఆ పరీక్షలోనూ 2,33,248 అభ్యర్థులకు గాను అదనంగా 254 ఒఎంఆర్ షీట్స్ ఎలా వచ్చాయని ప్రశ్నించారు. టిఎస్‌పిఎస్‌సిని వెంటనే ప్రక్షాళన చేయాలని, ప్రస్తుతం కేసులో ఉన్న వారిని తొలగించాలని తెలిపారు. పరీక్ష రద్దుకు ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, జిల్లా కమిటీ సభ్యులు శివరాత్రి కరుణాకర్, సముద్రాల అనిల్, మాదాసి రాజు, అనంతగిరి దేవేందర్, లింగాల ప్రణయ్, నోముల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించండి : సంకె రవి

మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల రోజులుగా విషజ్వరాలు, డెంగ్యూతో ప్రజలు అల్లాడిపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని వ్యవహరిస్తోందని విమర్శించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ప్రజలు విషజ్వరాలతో ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం సమస్యనే లేదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు ఎనిమిది మందికిపైగా చనిపోయారని తెలిపారు. గ్రామాలు, వార్డులు జ్వర పీడితులతో అల్లాడుతున్నాయని, ప్రభుత్వ వైద్యం అందక రోగులు అప్పులు చేసి ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా ఆరోగ్యశాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. తక్షణమే మంచిర్యాల జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి అన్ని మండలాలు, పట్టణాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. జిల్లా ఆస్పత్రి నుంచి సబ్‌సెంటర్ వరకు 24 గంటలు వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్, దూలం శ్రీనివాస్, నాయకులు ప్రేమ్‌కుమార్, మహేష్, కుమార స్వామి, మహేందర్, శ్రీకాంత్, ఏల్పుల శంకర్, భూదేవి, రేణుక, రమ్య, సమ్మక్క, శ్రీనివాస్, కుమార్, శివ పాల్గొన్నారు.

చెరువులో పడిన బాలుడ్ని కాపాడబోయి ముగ్గురు మహిళల మృతి

- బాలుడి కోసం కొనసాగుతున్న గాలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ దేవతలకు బోనాల పండగకు వచ్చిన ఓ కుటుంబంలో బాలుడు నీట మునగడంతో .. అతన్ని కాపాడబోయి.. ముగ్గురు మహిళలు ఒక్కసారిగా చెరువులో పడి నీట మునిగి మృతి చెందారు. ఈ సంఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాలుడు గల్లంతయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగాయిపల్లి గ్రామంలో ఆదివారం దళితులు.. గ్రామదేవతలకు బోనాల పండుగను నిర్వహించుకున్నారు.

కాగా గ్రామానికి చెందిన ఫిరంగి చంద్రయ్య ఇంటికి బోనాల పండగ సందర్భంగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన అతని బావమరుదుల భార్యలు దొడ్డ బాలమణి(30) ఆమె కుమారుడు చరణ్(6), దొడ్డ లక్ష్మి(25) చుట్టపు చూపుగా వచ్చారు. కాగా, సోమవారం మధ్యాహ్నం సమయంలో దొడ్డ బాలమణి ఆమె కుమారుడు చరణ్, తోటికోడలు దొడ్డ లక్ష్మితోపాటు ఫిరంగి చంద్రయ్య కూతురు లావణ్య (20) కలిసి గ్రామ పెద్ద చెరువు బతుకమ్మ మెట్ల వద్ద బట్టలు ఉతకడానికి వెళ్లారు. అదే సమయంలో చరణ్ నీటిలో ఆడుతూ కాలుజారి మునిగిపోయాడు. అక్కడే ఉన్న ముగ్గురు మహిళలు కాపాడేందుకు వెళ్లి ఒకరి తరువాత ఒకరు నీటిలో మునిగి పోయారు. వారిని గ్రామస్తులు బయటకు తీశారు. అప్పటికే వారు మృతి చెందారు. బాలుడి జాడ లేకపోడంతో పోలీసులకు సమాచారం అందించారు. మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాలుని కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యపరిశ్రమ సంక్షేమంపై మ్యానిఫెస్టోలో చేర్చాలి

- రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలి : లెల్లెల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్స్యకారుల సంక్షేమానికి ప్రతి బడ్జెట్‌లోనూ రూ.ఐదు వేల కోట్లు కేటాయించి ఖర్చు చేస్తామని హామీ ఇస్తూ అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించాలని మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ నగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో గెలిచిన చైర్మెన్ కొప్పు పద్మ, వైస్ చైర్మెన్ బైరి వినోద్‌కుమార్, డైరెక్టర్లకు సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లెల్లెల బాలకృష్ణ మాట్లాడారు. అక్టోబర్ 3న మత్స్యకారుల సమస్యలపై చలో మత్స్య భవన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నరసింహ, తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షులు గాలి సత్యనారాయణ, గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆప్ట్రోనిక్స్ స్టోర్లలో ఐఫోన్ 15 లభ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్

భారత్‌లో తొలి ఆపిల్ ప్రీమియం పార్టనర్ ఆప్ట్రోనిక్స్ స్టోర్లలో ఐఫోన్ 15 సీరిస్ స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. దేశ వ్యాప్తంగా 56 ఆప్ట్రోనిక్స్ స్టోర్స్‌లో ఐఫోన్ 15 సహా, ఆపిల్ వాచ్ 9, ఆపిల్ వాచ్ అల్ట్రా2 కూడా లభ్యం అవుతాయని పేర్కొంది. ఆపిల్ కంపెనీకి దేశ వ్యాప్తంగా అతిపెద్ద భాగస్వామిగా ఎదిగే దిశగా ఆప్ట్రోనిక్స్ యత్నాలు చేస్తోందని పేర్కొంది. కొత్త ఉత్పత్తులపై భారీ డిస్కౌంట్లు అందిస్తోన్నట్లు తెలిపింది.



పథకాల్లో అర్హులకే ప్రాధాన్యతివ్వాలి

సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దళితబంధు, బిసి బంధు, పింఛన్లు, మైనార్టీబంధు, గృహలక్ష్మీ, డబుల్ బెడ్ రూమ్ తదితర సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకే ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. పేదలను పక్కనబెట్టి బిఆర్ఎస్ కార్యకర్తలకే పథకాలు అప్పగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సంక్షేమ పథకాలను అధికార పార్టీ కార్యకర్తలకే ఇవ్వడాన్ని నిరసిస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా చేశారు. నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మెయిన్ గేటు వద్ద పోలీసులకు, సిపిఎం కార్యకర్తలకు మధ్య తీవ్ర తోపులాట, వాగ్వివాదం చోటుచేసుకుంది. పలువురు కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం ముఖ్య నాయకులను కలెక్టరేట్‌లోకి అనుమతించగా.. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ వెంకట్రావుకు అందజేశారు. అంతకుముందు మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలన్నింటినీ బిఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చే విధానాన్ని ప్రజాప్రతినిధులు మార్చుకోవాలని సూచించారు. అర్హులైన పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వస్తే గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీల పెద్దలు కూర్చొని అర్హులైన నిరుపేదలను గుర్తించి.. వారికి వర్తింపజేసేవారని గుర్తు చేశారు. కానీ, బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తోందని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, ప్రజాసంఘాల జిల్లా నాయకులు ములకలపల్లి రాములు, కాసాని కిషోర్, ఎం రాంబాబు, కడెం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో కాంగ్రెస్ 'ఫైటర్' ఎవరో?

- ఎఐసిసి లెవల్లో బొమ్మకల్ సర్పంచ్ ప్రయత్నాలు
- టికెట్ ధీమాతోనే హస్తం గూటికి జయపాల్‌రెడ్డి
- సైలెంట్ మోడ్‌లో ఎమ్మెస్సార్ మనువడు రోహిత్‌రావు
- కాంగ్రెస్ గ్యారంటీ కార్డు ప్రచారంలో నరేందర్‌రెడ్డి
- రహస్య సర్వే.. కేడర్‌పై అధిష్టానం నజర్
- కాంగ్రెస్ ఫస్ట్ లిస్టులో 'గంగుల'ను ఢీకొట్టే నాయకుడు తేలేనా?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ కాంగ్రెస్‌లో టికెట్లపై ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. కొందరు ప్రచారంలోకి దిగేశారు. అధికార పార్టీ నేత మంత్రి గంగుల కమలాకర్‌ను ఢీకొట్టే ఫైటర్ ఎవరా? అన్న చర్చ సాగుతున్న క్రమంలో హస్తం టికెట్ కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు పడ్డారు. అందులోనూ ఇటీవల బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన బొమ్మకల్ సర్పంచ్ పురుమళ్ల శ్రీనివాస్ ఢిల్లీలో మకాంవేసి ఎఐసిసి లెవల్లో ప్రయత్నాలు సాగిస్తున్నారు. మరోవైపు ఆర్థికంగా బలంగా ఉన్న మైత్రిసంస్థల చైర్మెన్ జయపాల్‌రెడ్డి టిక్కెట్ ధీమాతోనే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇంకోవైపు మొదట్నుంచీ కాంగ్రెస్ వాయిస్ వినిపిస్తున్న పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తనకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రచారంలో దిగారు. మరోవైపు సిఎం అన్న కూతురు రమ్యారావు సైతం కాంగ్రెస్ గ్యారంటీ కార్డుతో జనంలో తిరుగుతున్నారు.

2004 నుంచి 2009 వరకు ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తన ప్రాబల్యాన్ని బలంగా చాటుకుంది. తెలంగాణ ఆవిర్భావం తరువాత కీలకమైన నాయకులు టిఆర్ఎస్, ఇతర పార్టీల్లోకి వెళ్లిపోవడంతో క్షేత్రస్థాయిలో బాగా బలహీనపడింది. టిపిసిసి అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి పగ్గాలు చేపట్టిన తరువాతి పరిణామాలు, ప్రస్తుతం రాష్ట్రంలో బిజెపి సైలెండ్‌మోడ్‌లోకి వెళ్లిపోవడం.. కర్ణాటక గెలుపు, ఇటీవల పార్టీ అధినేత్రి సోనియా రాకతో పుంజుకుంది. ప్రస్తుతం ఆ పార్టీలో నియోజకవర్గాల వారీగా టిక్కెట్ ఆశించే వారు పదుల సంఖ్యలో ఉన్నారు. అందులో కరీంనగర్ సెగ్మెంట్‌లో 15 అప్లికేషన్లు రావడం గమనార్హం. కానీ టిక్కెట్ తమకే వస్తుని ఐదారుగురు మాత్రమే తమ వాణి వినిపిస్తున్నారు. అయితే ఇక్కడ మొదట్నుంచీ అధికార పార్టీపై ఫైట్ చేస్తున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ పిలుపునందుకుని కార్యక్రమాలు చేయడం, ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి పనులపై ప్రశ్నిస్తూ యాక్టీవ్‌రోల్‌లో కనిపించేవారు.

పార్టీ విధేయుడిగా పని చేసిన తనకే టిక్కెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఎన్నికల సమయంలోనే కనిపించే సిఎం అన్న కూతురు రమ్యారావు కూడా పార్టీ గ్యారంటీ స్కీం పత్రాలను పట్టుకుని రెండ్రోజులుగా ప్రచారం చేసుకుంటున్నారు. మరోవైపు మొన్నటివరకూ యాక్టీవ్‌గా కార్యక్రమాలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నేత, దివంగత ఎమ్మెస్సార్ మనువడు రోహిత్‌రావు పక్షం రోజులుగా సైలెండ్‌మోడ్‌లోకి వెళ్లిపోయినట్టు కనిపిస్తోంది. దీంతో ప్రధానంగా మైత్రీచానెల్ చైర్మెన్ జయపాల్‌రెడ్డి, బొమ్మకల్ సర్పంచ్ శ్రీనివాస్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయినప్పటికీ పార్టీ హైకమాండ్ రహస్య సర్వే చేయిస్తోంది. పార్టీ కేడర్ అడుగులపైనా నజర్ పెట్టింది.

మూడ్రోజులుగా ఢిల్లీలోనే 'పురుమళ్ల'

బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఈనెల 23న టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పురుమళ్ల శ్రీనివాస్ మూడ్రోజులుగా ఢిల్లీలోనే ఉండి ఏఐసీసీ లెవల్లో టిక్కెట్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరిద్దరు ఆశావహులు తమ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ గురించి వివరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ మిగతా నాయకులు టిపిసిసి పెద్దల ఆశీర్వాదాన్నే నమ్ముకున్నారు. కానీ పురుమళ్ల మాత్రం ఏకంగా ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. మిగతా ఢిల్లీ స్థాయి నేతల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తూ కలుస్తుండటం ఇప్పుడు కరీంనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి పార్టీ కేడర్‌ను, టిపిసిసిని కాదని ఎఐసిసి లెవల్లో నెరుపుతున్న ప్రయత్నం హాట్‌టాపిక్‌గా మారింది.

టికెట్ ధీమాతోనే జైపాల్‌రెడ్డి చేరిక..

మైత్రి గ్రూప్స్ చైర్మెన్ కొత్త జైపాల్ రెడ్డి తొలుత బిజెపి నుంచి పోటీ చేస్తారని భావించారు. కానీ తన అనుచరగణంతో టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. టిక్కెట్ ధీమాతోనే హస్తం గూటికి చేరిన ఆయన అదే రోజు భారీ కాన్వాయ్‌తో కరీంనగర్‌కు వచ్చారు. అయితే ఆయన మొదట్నుంచీ అధికారపార్టీపై ఆందోళనలుగానీ, ధర్నాలుగానీ చేసింది లేదు. ఏనాడూ ప్రజాక్షేత్రంలో తిరిగింది లేదు. కేవలం పలు సేవాకార్యక్రమాలతో దర్శనమిచ్చే ఆయన టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకున్న రోజు నుంచీ పెద్దగా జనంలోకి వచ్చింది లేదు. ఆర్థిక బలమున్న నేతగా పేరుండటంతో 'గంగుల'పై పోటీ చేసేందుకు తనకే అవకాశం ఇస్తారన్న ధీమాతో ఉన్నారు.